సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 2018 ఎన్నికల కేటీఆర్ మ్యానిఫెస్టో

కేటీఆర్ మ్యానిఫెస్టో అమలు 95 శాతం

- సిరిసిల్లకు ఇచ్చిన మెజార్టీ హామీలు నెరవేర్చిన మంత్రి
- 2018 సిరిసిల్ల మ్యానిఫెస్టో సోషల్‌మీడియాలో వైరల్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లకు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా నెరవేర్చారు. 2018లో ఇచ్చిన 15 ముఖ్యమైన హామీల్లో 13 హామీలను నెరవేర్చి, మాటనిలుపుకొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి సిరిసిల్ల అభివృద్ధిపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకొన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ 2018 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన మ్యానిఫెస్టో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఓ ఔత్సాహికుడు కేటీఆర్ ఇచ్చిన హామీలు ఎంతమేర నెరవేరాయని విశ్లేషించి, పోస్ట్ పెట్టగా భారీ స్పందన వస్తున్నది. సిరిసిల్ల మీద రామన్న కున్న ప్రేమకు ఇది నిదర్శనమని స్థానిక నెటిజన్లు కామెంట్లు చేశారు. ఆ రాముడిలెక్క ఈ తారకరాముడు మాటిస్తే తప్పడని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

2018లో కేటీఆర్ ఇచ్చిన హామీలు–అమలు

1. **రోడ్డు విస్తరణ:** బైపాస్ రోడ్డు పూర్తయింది.
2. **రైల్వే లైన్:** భూసేకరణ పూర్తయింది.
3. **అక్వాహబ్:** మంజూరైంది.. ప్రగతిలో ఉంది.
4. **మిడ్‌మానేరు పర్యాటక కేంద్రం:** రిసార్ట్‌లు, కాటేజీలు, బోటింగ్.. ఇందు లో బోటింగ్ పూర్తయింది.
5. **పాలధార నివారణ చర్యలు:** పూర్తయ్యాయి.
6. **మానేరు పరివాహక ప్రాంతంలో మినీట్యాంక్‌బండ్‌లుగా చెరువులు:** పూర్తయ్యాయి.
7. **సిరిసిల్లకు ఇంజినీరింగ్ కళాశాల:** ఏర్పాటయింది. అదనంగా మెడికల్, డిగ్రీ కళాశాల కూడా ఇచ్చారు.
8. **వ్యాపారాభివృద్ధికి అధునాతన షాపింగ్ మాల్ నిర్మాణం:** ఇంకా కాలేదు.
9. **సందర్శక ప్రాంతాలుగా పట్టణంలోని చెరువుల పునరుద్ధరణ:** పూర్తయింది.
10. **సిరిసిల్ల పట్టణంలో గ్రీనరీ, డివైడర్, సెంట్రల్ లైటింగ్:** పూర్తయింది.
11. **సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ భవన నిర్మాణం, జిల్లా పోలీసు కార్యాలయం, నర్సింగ్ కళాశాల, డబుల్ బెడ్రూంలు, మౌళిక వసతుల కల్పన:** అన్ని పూర్తయ్యాయి. డబుల్ బెడ్రూంల విషయంలో రాష్ట్రంలోనే సిరిసిల్ల వందశాతం బెటర్.
12. **పట్టణ విస్తరణ దృష్ట్యా డంపింగ్ యార్డు:** పూర్తయింది.
13. **మున్సిపల్ లేఅవుట్ స్థలాల అభివృద్ధి:** అవుతున్నాయి.
14. **వైకుంఠధామాల అభివృద్ధి:** పూర్తయ్యాయి.
15. **సిరిసిల్ల పట్టణంలో వీలీనమైన గ్రామాల అభివృద్ధి, మౌళిక వసతుల కల్పన, సామాజిక భవనాల నిర్మాణం:** ఫర్వాలేదు

కేసీఆర్‌తోనే కులవృత్తులకు జీవం

- బీఆర్ఎస్ అంటే బీసీల సర్కార్
- కాంగ్రెస్ పాలనలో బడుగులకు తీరని అన్యాయం
- ఏండ్లు అధికారంలో ఉండికూడా కుల గణన ఎందుకు చేయలేదు?
- రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్
- బీఆర్ఎస్‌కే పట్టంగట్టాలని విజ్ఞప్తి

గౌడ కులస్థులు బహూకరించిన మోకుతో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్‌తోనే కులవృత్తులకు పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమంటే బీసీల ప్రభుత్వమని, బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. గతంలో పని చేసిన ప్రభుత్వాలు బీసీలను, కుల వృత్తులను నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. కుల గణన చేయాలంటున్న రాహుల్‌గాంధీ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకొస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆరేనని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన గౌడ, నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు.. బీసీల ప్రభుత్వం అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల మంది బీసీ బిడ్డలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామని తెలిపారు. తొమ్మిదేండ్లలో ఎంతో పని చేశాం కాబట్టే హక్కుగా ప్రజల వద్దకు వస్తున్నామని చెప్పారు. ఎన్నికలప్పుడు అనేక పార్టీలు వస్తాయని, బీసీల కోసం గతంలో ఏంచేశారో వారిని నిలదీయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

గౌడ కులస్థులకు అండగా కేసీఆర్

తెలంగాణ ఏర్పాటైతే గౌడ కులస్థులకు అండగా ఉంటామని కేసీఆర్ ఆనాడే చెప్పారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. అందుకు అనుగుణంగానే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం పాలసీగా తీసుకుని ఈత వనాలను పెంచుతున్నదని తెలిపారు. మద్యం టెండర్లలో 15 శాతం రిజర్వేషన్లు కల్పించిందని వివరించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గీతకార్మికులకు ఇంకా ఏమైనా సమస్యలుంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కవిత హామీ ఇచ్చారు.

సెలూన్లకు ఉచిత విద్యుత్తు

రాష్ట్రంలోని హెయిర్ సెలూన్లకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నది కేవలం కేసీఆర్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణులు అశ్విని దేవతల వారసులని పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణులు లేకుంటే సమాజానికి ఎంతటి ఇబ్బంది ఉంటదో సీఎం కేసీఆర్ ఎన్నోసార్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించారని, కులవృత్తిని కాపాడేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 వేల సెలూన్లకు సబ్సిడీ విద్యుత్తు అందిస్తున్నారని వివరించారు. 12 లక్షల కల్యాణలక్ష్మి లబ్ధిదారులు ఉంటే, అందులో 7 లక్షల మంది బీసీలేనని తెలిపారు. 60 ఏండ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో బీసీ గణన ఎందుకు చేయలేదో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని నిలదీశారు. దేశంలో ఉన్న బీసీలకు న్యాయం జరగాల్సిందేనని అన్నారు. కేసీఆర్ మీద అభిమానంతో రెండుసార్లు ఆశీర్వదించి గెలిపించారని, మళ్లీ బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీమాతో గీత కార్మికులకు ధీమా

రాష్ట్రం ఏర్పడ్డాక కులవృత్తుల వారికి సీఎం కేసీఆర్ అండగా నిలిచారని ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. గీత కార్మికులకు ఆసరా పింఛన్లతో పాటు గీతకార్మిక బీమా అమలు చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ధీమా కల్పిస్తున్నదని పేర్కొన్నారు. గీత వృత్తిని నమ్ముకున్న వారి ఆర్థికవృద్ధి కోసం ప్రభుత్వం హైదరాబాద్‌లో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేసిందని తెలిపారు. నిజామాబాద్‌లో కూడా నీరాకేఫ్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. నాయీబ్రాహ్మణులకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించామని చెప్పారు. తనను ఎమ్మెల్యేగా, కవితక్కను ఎంపీగా గెలిపిస్తే మరింత సేవ చేస్తామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌తో సీట్లపై పొత్తు కుదరలే..

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మీడియాతో మాట్లాడుతున్న నారాయణ. చిత్రంలో కూనంనేని, సయ్యద్ అజీజ్‌పాషా

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో వామపక్షాల సీట్ల విషయంలో ఎలాంటి అవగాహన కుదరలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ వెల్లడించారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరుపక్షాల నడుమ చర్చలు జరుగుతున్నాయని, ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దని హితవు పలికారు. సీపీఐ, సీపీఎం చెరి ఐదు సీట్ల చొప్పున ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్‌కు జాబితాలు అందజేసినట్టు వివరించారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు ఉన్నా, కొన్నిచోట్ల కలిసి, మరి కొన్ని చోట్ల విభేదించుకుంటున్నాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌కు ఆరు నెలల ముందు నుంచే ఎలాంటి ఎన్నికల హామీలు, వరాలు, పథకాలు ప్రకటించకుండా, అధికారుల బదిలీలు చేపట్టకుండా నిరోధించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నారాయణ సూచించారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మంగళవారం లేఖ రాసినట్టు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటీ నర్సింహ పాల్గొన్నారు.

చెన్నారెడ్డి కుటుంబంలో చిచ్చు?

- కొడుకు, మనువడు చెరో పార్టీ నుంచి బరిలోకి!
- బీజేపీ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి ఆదిత్యారెడ్డి
- సనత్‌నగర్‌లో తండ్రీకొడుకుల సమరం

హైదరాబాద్ సిటీబ్యూరో / బేగంపేట, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కుటుంబంలో చిచ్చు రేగిందా? రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కొడుకు మర్రి శశిధర్ రెడ్డి, మనువడు ఆదిత్యారెడ్డి ఒకే నియోజకవర్గం నుంచి తలపడేందుకు సిద్ధమవుతున్నారా? సనత్‌నగర్ నియోజకవర్గంలో ఇదే అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన మర్రి శశధర్‌రెడ్డి సనత్‌నగర్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన కొడుకు ఆదిత్యారెడ్డి మాత్రం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. ఇలా వేర్వేరు పార్టీల నుంచి తలపడేందుకు సిద్ధమవుతున్న తండ్రీ కొడుకులకు టికెట్లు ఇంకా అధికారికంగా ఖరారు కాకపోయినప్పటికీ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేశారు. ఆదిత్యారెడ్డి ఒక పక్క తన తాత మర్రి చెన్నారెడ్డి ఫొటో, మరో పక్క తన ఫొటోతో ఫ్లెక్సీలు రూపొందించారు. తండ్రీ కొడుకుల మధ్య కొంతకాలంగా గ్యాప్ ఏర్పడిందనే టాక్ వినిపిస్తున్నది. అయితే తండ్రీ కొడుకులు వ్యూహాత్మకంగానే చెరో పార్టీలో కొనసాగుతున్నారనే చర్చ కూడా నడుస్తున్నది.

కాంగ్రెస్‌కు బీల్యానాయక్ రాజీనామా

- నేడు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

దేవరకొండ, అక్టోబర్ 10: కాంగ్రెస్ పార్టీ ఒంటెద్దు పోకడలు నచ్చక తాను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు ఆ పార్టీ నేత కేతావత్ బీల్యానాయక్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బుధవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండలోని తన నివాసంలో బీల్యానాయక్ మీడియాతో మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల విధానాలు నచ్చకనే పార్టీ మారుతున్నట్టు ఆయన చెప్పారు. దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో సరైన నాయకుడు లేడని, పేదలకు న్యాయం జరగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతోనే సాధ్యమని నమ్ముతున్నానని పేర్కొన్నారు.

వనపర్తిని మాడల్ జిల్లా చేయడమే లక్ష్యం

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు/ఖిల్లాఘణపురం, అక్టోబర్ 10: దేశంలోనే మాడల్ జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాతపల్లి సమీపంలోని చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి మంత్రి పూజలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని అర్చకులు వేదమంత్రాతో ఆశీర్వదించారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై రూపొందించిన డాక్యుమెంటరీని కార్యకర్తల మధ్య కూర్చొని మంత్రి వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మహాయజ్ఞంలా జరిగాయని తెలిపారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే.. రానున్న ఎన్నికల్లో విజయం సులభమవుతుందని చెప్పారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 70 వేల సభ్యత్వాలు ఉన్నాయని, ప్రతి ఇంటికీ ఏదో రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. అలాగే ఖిల్లాఘణపురం మండలం గట్టుకాడిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి పూజలు చేశారు.

కాంగ్రెస్‌లో టికెట్ ఫైట్!

- ధర్నా చౌక్‌గా మారిన గాంధీభవన్
- 'కందనూలు' కోసం నాగం అనుచరుల వీరంగం
- కల్వకుర్తి కాంగ్రెస్‌లో ప్యారాచూట్ నేత చిచ్చు
- 'గోషామహల్' స్థానికులకే ఇవ్వాలని డిమాండ్
- జనరల్ స్థానాల్లోనూ సీట్లివ్వాలని ఎస్టీల ఆందోళన
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి తగులుతున్న 'టికెట్ల' సెగ

రేవంత్ వర్సెస్ కోమటిరెడ్డి

ఇబ్రహీంపట్నం టికెట్ ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ వర్సెస్ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య చిచ్చు పెట్టింది. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి టికెట్ ఇప్పించేందుకు రేవంత్ పావులు కదుపుతుండగా.. తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే నియోజకవర్గంలో నీ పెత్తనం ఏమిదంటూ కోమటిరెడ్డి ఫైర్ అవుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ఇటీవల ఢిల్లీ వేదికగా ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఓవైపు మల్‌రెడ్డి టికెట్ తనదేనంటూ ప్రచారం చేసుకుంటుండగా.. కోమటిరెడ్డి సూచనతో మరో నేత మర్రి నిరంజన్‌రెడ్డి కూడా తనదే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/నాగర్‌కర్నూల్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): టికెట్లు ప్రకటించక ముందే గాంధీ భవన్‌లో టికెట్ల చిచ్చు రేగింది. తమ నేతకు టికెట్ ఇవ్వాలంటూ పలువురు నేతల కార్యకర్తలు ఏకంగా గాంధీభవన్‌లోనే ధర్నాలు చేస్తున్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అనుచరులు గాంధీ భవన్‌లో వీరంగం సృష్టించారు. నాగర్‌కర్నూల్ టికెట్‌ను తమ నేతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. అక్కడ కొత్తగా పార్టీలో చేరిన కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి టికెట్ ఇస్తే సహించేది లేదని హెచ్చరించారు. అప్పుడే పీఏసీ సమావేవానికి వస్తున్న రేవంత్‌రెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్‌ను నమ్ముకొని నాగం పని చేస్తుంటే, కాంగ్రెస్‌ను గాలికి వదిలేసి మళ్లీ పార్టీలోకి వచ్చే నాయకులకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అదే విధంగా ఎస్టీ వర్గం నేతలు కూడా గాంధీ భవన్‌లో ధర్నాకు దిగారు. పార్టీలో ఎస్టీ వర్గానికి చెందిన నేతలు చాలా మంది ఉన్నారని, తమకు తగినన్ని సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే ఎస్టీ రిజర్వు స్థానాలే కాకుండా జనరల్ స్థానాల్లోనూ తమకు సీట్లు కేటాయించాలని నినాదాలు చేశారు. ఇక గోషామహల్ నేతలు కూడా గాంధీభవన్‌లో ధర్నాకు దిగారు. గోషామహల్ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఆ పార్టీ నేత మెట్టు సాయి పోటీలో ఉన్నారు. అయితే ఈ స్థానానికి మహిళా కాంగ్రెస్ నేత సునీతా రావు పోటీ పడుతున్నారు. దీంతో అక్కడ టికెట్ కోసం కొట్లాట మొదలైంది. గాంధీ భవన్ వేదికగా పార్టీనేతలు ధర్నాలు చేస్తుండటం గమనార్హం. ఓ దశలో రేవంత్ జోక్యం చేసుకొని 'గాంధీ భవన్‌లో ధర్నా చేస్తే సస్పెండ్ చేస్తా' అంటూ హెచ్చరించారు. రేవంత్ హెచ్చరికలను ఎవరూ ఖాతరు చేయకపోవడం గమనార్హం. మళ్లీ యథావిధిగానే గాంధీ భవన్ ధర్నా చౌక్‌గా మారిపోయింది.

తగ్గేదేలే అంటున్న సుంకిరెడ్డి వర్గం

ప్యారాచూట్ నేత కసిరెడ్డి నారాయణ రెడ్డికి కల్వకుర్తి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదంటూ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వర్గం హెచ్చరిస్తున్నది. ఇప్పటికే ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, కల్వకుర్తి మండలాల నేతలు, కార్యకర్తలు వరుస సమావేశాలు ఏర్పాటు చేసి కసిరెడ్డికి వ్యతిరేకగళం వినిపించారు. కసిరెడ్డికి టికెట్ ఇప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి మంగళవారం ఆమనగల్లు పరిధిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సుంకిరెడ్డితోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు బహిష్కరించారు. ఇదే సమయంలో తలకొండపల్లి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కసిరెడ్డికి టికెట్ ఇస్తే పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తామని తీర్మానించినట్టు సమాచారం. సర్వేలు, దరఖాస్తులు అంటూ ప్యారాచూట్ నేతకు టికెట్ ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు.

అప్పుడే మొదలైన రేవంత్ ధమ్కీ

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి బెదిరింపులకు దిగారు. అధికారుల సంగతి చూస్తాం అనేవిధంగా హెచ్చరికలు జారీచేశారు. ఎన్నికల సమయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అలాంటివారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. డీజీపీ నుంచి బీఎల్‌వో వరకు అధికారుల జాబితాను రూపొందిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కమిటీనే ఏర్పాటు చేసినట్టు చెప్పుకొన్నారు.

మీడియాకూ బెదిరింపులే

మీడియాను కూడా బెదిరించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నించారు. తమ పార్టీలో ఏదో జరిగిపోతున్నట్టుగా, మీటింగుల్లో చొక్కాలు చింపుకొని కొట్టుకున్నట్టుగా వార్తలు రాస్తే అలాంటి పేపర్లు, టీవీలపైనా ఈసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. యాజమాన్యాలతో పాటు వార్తలు రాసే రిపోర్టర్లపైనా క్రిమినల్ కేసులు పెడతామని బెదిరించారు.

పీక్ స్టేజ్‌కి ఫ్రస్ట్రేషన్

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మీడియాను బెదిరించటంపై సీనియర్ జర్నలిస్టులు మండిపడుతున్నారు. వాస్తవాలు రాస్తే ఉలుకెందుకంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అధికారులను బెదిరించడం ఏమిటని అధికారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిబంధనల ప్రకారం అధికారులు విధులు నిర్వహిస్తారని, వారిపై ఓ రాజకీయ పార్టీ ఈ విధంగా బెదిరింపులకు పాల్పడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఓవైపు పార్టీలో తన మాట చెల్లకపోవడం, మరోవైపు పార్టీ ఓటమి ఖాయమనే సంకేతాలు వెలువడటం, ఇంకోవైపు అధిష్ఠానం నుంచి మొట్టికాయలు పడుతుండంతో రేవంత్‌రెడ్డిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయిందని, అందుకే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

నియామకాలు చెల్లవట!

రాష్ట్రప్రభుత్వం గత ఆరు నెలల్లో చేపట్టిన నియామకాలను, నిర్వహించి టెండర్లను వెంటనే రద్దుచేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొంటే క్రిమినల్ కేసులు పెడుతామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కార్పొరేషన్ల నియామకాల చెల్లవని అడ్డగోలుగా మాట్లాడారు. దీనిపై మేధావులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల కోడ్ లేనప్పుడు రాష్ట్రప్రభుత్వాన్ని నియంత్రించే అధికారం ఈసీకి లేదన్న విషయం రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చని అంటున్నారు. కార్పొరేషన్లకు నియామకాలు చేపట్టేటప్పుడు నెలకోసం, రెండునెలల కోసం నియమిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక టెండర్ల విషయంలో కాంట్రాక్టర్లను బెదిరించటంపై ఆయా వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. తుచ్ఛమైన రాజకీయాల కోసం తమను అవినీతిపరులుగా చిత్రిస్తారా? అని కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు.

పథకాలను అడ్డుకుంటే గుణపాఠం తప్పదు

పథకాలను అడ్డుకోవాలని చూస్తే ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా చేస్తామని ప్రజలు, రైతులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఎలాగూ పేదలకు మేలు చేయాలనే ఆలోచన లేదని, తమకు మేలు చేస్తున్న వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలను చేసింది. దీంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. అయినప్పటికీ ఆ పార్టీ తీరు మారలేదని మండిపడుతున్నారు. పేదల సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే మరోసారి భంగపాటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పథకాలు ఆపారా?

నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకాలను ప్రారంభించరాదు. అప్పటికే కొనసాగుతున్న పథకాలను యథావిధిగా అమలు చేయొచ్చు. రేవంత్‌రెడ్డి మాత్రం ఎప్పటినుంచో అమలవుతున్న పథకాలను కూడా ఆపేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలకు కూడా దాదాపు ఒకేసారి ఎన్నికలు జరుగనున్నాయి. ఆ రాష్ట్రాల్లో కూడా ఎన్నికల కోడ్ తెలంగాణతోపాటే అమల్లోకి వచ్చింది. మరి ఆ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఆపేశాయా రేవంత్? అని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. నిజాలు తెలియకపోతే ఎన్నికల నిబంధనావళిని చదువుకోవాలని సూచిస్తున్నారు. ఏనాడైనా ప్రజల గురించి ఆలోచిస్తే సంక్షేమ పథకాల విలువ తెలిసేదని మండిపడుతున్నారు.

శ్రీనివాస్‌గౌడ్ ఎన్నిక సబబే

- పిటిషనర్ అభ్యంతరాలను తోసిపుచ్చిన హైకోర్టు
- ప్రతిపక్షాల కుట్రను బయటపెడతా: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ శాసనసభ్యుడిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికను సవాల్ చేస్తూ అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు సీహెచ్ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం లక్ష్మణ్ మంగళవారం తీర్పు వెలువరించారు. రాష్ట్ర శాసనసభకు 2018లో జరిగిన ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి పోటీచేసిన శ్రీనివాస్‌గౌడ్.. నామినేషన్‌తోపాటు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌ను వెనక్కి తీసుకుని మార్పులు చేసి మరోసారి సమర్పించారని, ఇది చట్ట వ్యతిరేకమని, ఆయన ఎన్నికను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. అయితే పిటిషనర్ అభ్యంతరాన్ని హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్ తగిన ఆధారాలు చూపలేదని ఆక్షేపించింది. చట్ట ప్రకారమే ఎన్నికల అఫిడవిట్ దాఖలు చేశామన్న శ్రీనివాస్‌గౌడ్ వాదనను ఆమోదించింది. ఇరుపక్షాల వాదనలు ఈ నెల 9న ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచి మంగళవారం వెలువరించింది.

హైకోర్టులో న్యాయమే గెలిచింది: శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్,